సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024




ఉగాది వేడుకలకు ముస్తాబు

ద్వారకాతిరుమల: ఉగాది వేడుకలకు చిన వెంకన్న క్షేత్రం ముస్తాబైంది. మంగళవారం క్షేత్రంలో ప్రత్యేక పూజలు, పంచాగ శ్రవణం, పండిత సత్కారాలు జరుగనున్నాయి.



భారీగా నగదు పట్టివేత

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో భారీగా నగదు పట్టుబడింది. 2లో ▸



న్యూస్‌రీల్

ఓట్లడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

అత్తిలి: అర్హులందరికీ సంక్షేమం అందించిన జగనన్న ప్రభుత్వం తరపున ప్రజలను ఓట్లడిగే హక్కు వైఎస్సార్‌సీపీ నాయకులకే మాత్రమే ఉందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అత్తిలి మండలం పాలి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరికీ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిపై అవగాహన కల్పించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలకు ఒకటో తేదీన అందాల్సిన పింఛన్లు ప్రతిపక్షనేత చంద్రబాబు కారణంగా ఇంటి గుమ్మంలోకి రాకుండా పోయాయని తెలిపారు. అవ్వాతాతలపై చంద్రబాబు కక్ష కట్టాడని ఆయన విమర్శించారు. టీడీపీకి ఓటేస్తే సంక్షేమానికి చరమగీతం పాడి, పెత్తందార్లకు దోచిపెడతారని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బీబీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పి.సత్యనారాయణ, సర్పంచ్ కేతా గౌరీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మూల్యాంకనం



టెన్త్ వాల్యుయేషన్ చేస్తున్న దృశ్యం

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యంకనం సోమవారంతో ముగిసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. వీరవాసరం ఎంఆర్‌కే జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 1 నుంచి 1,68,894 సమాధాన పత్రాలను 815 మంది ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారన్నారు. దీనికి సహకరించిన వివిధ ప్రభుత్వశాఖల అధికారులకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.

గాత్ర విద్వాంసురాలికి పురస్కారం



లంకా అనురాధ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడేనికి చెందిన గాత్ర సంగీత విద్వాంసురాలు లంకా అనురాధకు ప్రతిష్టాత్మకమైన మెగా సిటీ నవ కళావేదిక (హైదరబాద్) క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో అందజేశారు. ఆమెను గాన సభ అధ్యక్షుడు గరికిపాటి బాపయ్యశర్మ, కార్యదర్శి ఎస్.హనుమంతరావు, బీవీఆర్ కళా వేదిక అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు తదితరులు అభినందించారు.

తాగునీటి అవసరాల కోసం కంట్రోల్ రూమ్



సుమిత్‌కుమార్, కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారానికి భీమవరం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 08816-299616కు సమాచారం ఇవ్వాలని కోరారు. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

ఎన్నికలకు పటిష్ట భద్రత

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు చేపట్టాలనీ, పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అధ్యక్షతన జిల్లాలోని పోలీస్ అధికారులు, సాయుధ దళాల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎస్పీ మేరీ ప్రశాంతి జిల్లాలో చేపట్టిన చర్యలు, భద్రత, పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, పోలీస్ అధికారులు వాటిని సందర్శించి పరిస్థితులను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని ఐజీ అశోక్‌కుమార్ ఆదేశించారు.

రైతులకు వెన్నుదన్ను

- రబీకి సీలేరు జలాలు
- 3,200 క్యూసెక్కుల విడుదల
- శివారుకూ నీరందించేలా చర్యలు
- మరిన్ని రోజులు నీటి సరఫరాకు నిర్ణయం



భీమవరం ప్రాంతంలో పాలుపోసుకుంటున్న దాళ్వా వరిపైరు

భీమవరం: జిల్లాలో దాళ్వా సీజన్‌లో వరి సాగుకు మరో 20 రోజులపాటు సాగునీటి అవసరం ఉంది. నీటిపారుదల శాఖ ఈనెల 9 వరకు వంతుల వారీగా నీరు సరఫరా చేస్తామని గతంలోనే ప్రకటించగా ప్రస్తుతం పలుచోట్ల పైరు పాలుపోసుకునే దశలో ఉండటంతో మరిన్ని రోజులు నీరందించాల్సిన అవసరం ఏర్పడింది. అలాగే ఇప్పటికే గోదావరి నీటిమట్టం కూడా తక్కువగా ఉన్న నేపథ్యంలో సీలేరు జలాల విడుదలకు నీటిపారుదల శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

2.20 లక్షల ఎకరాల్లో..

జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా (రబీ) వరి సాగు చేపట్టగా ఇప్పటికే కొన్ని మండలాల్లో పంట మాసూళ్లు ప్రారంభమయ్యాయి. సాగునీరు సంవృద్ధిగా అందించడంతో పైరు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత డిసెంబర్‌లో తుఫాను కారణంగా సార్వా మాసూళ్లలో జాప్యం జరిగింది. దాని ప్రభావం ప్రస్తుత దాళ్వా సీజన్‌పై పడింది. కాలువ శివారు ప్రాంతాల్లో నాట్లు ఆలస్యం కావడంతో ఈ నెలాఖరు వరకు నీటి అవసరం ఉంటుందని అధికారులు అంటున్నారు.

20 మండలాల్లో..

జిల్లాలోని 20 మండలాల్లోని 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగుచేయగా ఇప్పటికే తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం వంటి ప్రాంతాల్లో మాసూళ్లు ప్రారంభమయ్యాయి. అత్తిలి, ఇరగవరం, పాలకోడేరు తదితర మండలాల్లో వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. కాళ్ల, నరసాపురం, మొగల్తూరు, భీమవరం, ఆకివీడు, ఉండి తదితర మండలాల్లో కాలువ శివారు భూముల్లో నాట్లు ఆలస్యం కావడంతో ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం పంట పాలుపోసుకునే, ఈనిక దశల్లో ఉంది. అక్కడ నెలాఖరు వరకు సాగునీరు అవసరముంటుంది. జిల్లాలో సాగునీటి అవసరాలకు ప్రస్తుతం 3,200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో 4,600 క్యూసెక్కులు చేయగా గోదావరిలో నీటిమట్టం తగ్గిపోవడంతో 2,800 క్యూసెక్కులకు తగ్గించారు. అయితే నీటి ఎద్దడి ఏర్పడటంతో రెండు రోజులుగా సీలేరు నుంచి గోదావరి నదిలోకి 7 వేల క్యూసెక్కుల నీటి విడుదలవుతుండగా జిల్లాకు నీటి సరఫరాను 3,200 క్యూసెక్కులకు పెంచారు. మాసూళ్లు ప్రారంభమైన ప్రాంతాలకు నీటి సరఫరాను తగ్గించి మిగిలిన ప్రాంతాలకు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పూర్తిస్థాయిలో నీటి సరఫరా

రైతులకు సాగునీటి ఎద్దడి ఏర్పడకుండా నీటి సరఫరాకు కృషి చేస్తున్నాం. సీలేరు జలాలు రావడంతో నీటి విడుదలను 3,200 క్యూసెక్కులకు పెంచాం. సీలేరు నుంచి 9 వేల క్యూసెక్కులు కోరగా ప్రస్తుతం 7 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రైతుల అవసరాల మేరకు ఎక్కువ రోజులు నీటి సరఫరా చేయడానికి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

–వి.దక్షిణామూర్తి, డీఈ నీటిపారుదలశాఖ

ఎద్దడి లేకుండా చర్యలు



జిల్లాలో సాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నాం. 20 మండలాల పరిధిలో దాదాపు లక్ష ఎకరాలకు నెలాఖరు వరకు సాగునీరు అవసరముంటుంది. తాడేపల్లిగూడెం మెట్ట ప్రాంతంలో మాసూళ్లు ప్రారంభమైనా భీమవరం, మొగల్తూరు, కాళ్ల తదితర మండలాల్లోని కాలువ శివారు భూములకు నీటిని ఇంకా అందించాల్సి ఉంది.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

అభివృద్ధిని అడ్డుకున్న బొలిశెట్టి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆగ్రహం



తాడేపల్లిగూడెం: గత **టీడీపీ పాలనలో** (2014–2019) **నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు** అడ్డుకున్న వ్యక్తి ప్రస్తుత జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ కాదా.. అలాంటి వ్యక్తికి కూటమి నాయకులు ఏ మొహం పెట్టుకొని పనిచేస్తారని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అప్పటి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పైడికొండల మాణిక్యాలరావు గెలుపొంది చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారన్నారు. అదే సమయంలో బొలిశెట్టి శ్రీనివాస్ టీడీపీ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా ఉండేవారన్నారు. అయితే అప్పటి జెడ్పీ చైర్మన్, బొలిశెట్టి కుమ్మక్కై మంత్రి పైడికొండలకు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలు నడిపి అభివృద్ధిని అడ్డుకోలేదా అని మంత్రి కొట్టు ప్రశ్నించారు. ఏపీ నిట్ గూడెం రాకుండా అప్పటి జెడ్పీ చైర్మన్ బాపిరాజు లాబీయింగ్ చేస్తే బొలిశెట్టి వంత పాడలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లగూడెం సెంటర్‌లో సెంట్రల్ ఎయిర్ కండీషన్ రైతుబజారు ఏర్పాటుకు మాణిక్యాలరావు కేంద్రం నుంచి నిధులు తెస్తే బొలిశెట్టి అడ్డుపడలేదా అన్నారు. మాణిక్యాలరావును అడుగడుగునా అడ్డుకుని మానసిక వ్యథకు గురిచేసిన విషయాలు కూటమి నాయకులకు తెలియవా అని అన్నారు. అప్పట్లో మాణిక్యాలరావు వేసిన సీసీ రోడ్డుకు కొనసాగింపుగా చిలకంపాడు లాకుల నుంచి ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు రూ.45 కోట్లతో నాలుగు లైన్లుగా తాను అభివృద్ధి చేశానన్నారు. బలుసులమ్మ ఆలయానికి మరిన్ని నిధులు ఇచ్చి అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన నాయకులు విజ్ఞత వదిలేసి తన హయాంలో చేపట్టిన యూజీడీ పనులను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి నాయకులు అభివృద్ధి సహకరించేవారెవరు, అడ్డుకునే వారెవరూ అని తెలుసుకోవాలని హితవు పలికారు. లేదంటే మాణిక్యాలరావు లాంటి నాయకులకు ద్రోహం చేసిన వారమవుతామని మంత్రి కొట్టు అన్నారు.

కోడ్ కచ్చితంగా పాటించాలి

భీమవరం: ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి హెడ్‌క్వార్టర్స్ సెబ్ స్పెషల్ యూనిట్ ఎస్పీ ఎస్‌వీఎస్ మూర్తి అన్నారు. సోమవారం భీమవరం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని సెబ్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పనిచేయాలని ఎట్టి పరిస్థితుల్లో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లడం, వారితో సంప్రదించడం చేయరాదన్నారు. అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్ పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేస్తూ మద్యం, సారా, నగదు, చీరలు అక్రమ రవాణాను అడ్డుకోవాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ (సెబ్) ఏటీవీ రవికుమార్, సెబ్ డీఎస్పీ జె.వెంకటనారాయణ, ఆర్‌సీహెచ్ చిట్టిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబువి కుట్ర రాజకీయాలు

విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్





తుందుర్రు, పెదగరువులో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులతో ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు 2014లో ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలంలోని తుందుర్రు, పెదగరువు గ్రామాల నుంచి సుమారు 150 కుటుంబాలు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి గ్రంధి శ్రీనివాస్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీని కైవసం చేసుకున్న చంద్రబాబు అధికారమే పరమావధిగా కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారన్నారు. గతంలో ప్రధాని మోదీని ఉగ్రవాదిగా సంబోధించారని గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్‌తో చేతులు కలిపి కుటిలత్వాన్ని బయట పెట్టుకున్నాడన్నారు. మళ్లీ ఇప్పుడు సీఎం జగన్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక పవన్‌కళ్యాణ్, బీజేపీతో కలిసి కుట్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. సీఎం జగన్ ఇంటింటా మేలు చేశారని, వాటిని గుర్తు చేసి వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసేలా ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. భీమవరం ఎమ్మెల్యేగా తనను, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు.

తుందుర్రులో.. దొంగ తులసమ్మ, నడిపూడి జానకి, కాండ్రేగుల కళ్యాణి, అన్నపూర్ణ, కడలి రాయుడు జమ్మి, దుర్గ, చీడే మాయారావు, కోయ బాలాజీ, ముత్యాలపల్లి శ్రీను, కాబోతుల దుర్గా ప్రసాద్, ముత్యాలపల్లి దేవయ్య, కోయ సురేష్, మల్లిపూడి నాయుడు, బల్ల శ్రీను, చిట్నేడి భద్రరావు, పెంటపాటి వినయ్, తాళ్ల ఏసుపాదం, మద్దా అగస్టీన్, సాకా సర్ని, దిప్పర్తి కార్తీక్, పల్లి కరుణాకర్, బొడ్డు లాజర్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు.


పెదగరువులో... చెందాడి చిన్నబాబు, తాడి రాము, ఆంజనేయులు, తమ్మి ముత్యాలు, యడపల్లి దుర్గారావు, ఇచ్చా రామన్న, యడపల్లి వెంకటనారాయణ, నరసింహమూర్తి, తాతారావు, పెరుమాళ్ల శ్రీరాములు, గొంతి సాల్మన్ రాజు, గండికోట బాలాజీ, గజ్జల కృష్ణమూర్తి, లక్ష్మణ్, జలసూత్రం లక్ష్మణస్వామి, తాడి కృష్ణమూర్తి, గజ్జల ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల నరసింహమూర్తి, జలసూత్రం కనకరత్నం, దిగమర్తి ఆదినారాయణ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల్లో 33 అత్యవసర సేవల విభాగాలకు చెందిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ సోమవారం ప్రకటనలో సూచించారు. పోస్టల్ బ్యాలెట్లు, ఓటింగ్ ప్రక్రియకు చేయాల్సిన ఏర్పాట్లు, హోమ్ ఓటింగ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లపై అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. నామినేషన్ల స్క్రూటినీ పూర్తయిన వెంటనే పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణ ప్రారంభమవుతుందని, వచ్చేనెల 5,6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఇబ్బంది పడకుండా వసతి, మౌలిక సౌకర్యాలు ఉన్నచోట్ల ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి, ఓట్ల స్వీకరణ చేపడతామన్నారు. ధ్రువీకరణ కోసం ప్రతి కేంద్రం వద్ద ఇద్దరు గెజిటెడ్ అధికారులను అందుబాటులో ఉంచాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలను బయటకు ఇవ్వమని, అక్కడికక్కడే జారీ చేసి ఓటింగ్ పూర్తి చేయిస్తామన్నారు. హోమ్ ఓటింగ్‌కు వచ్చిన దరఖాస్తులను బట్టి, ఇంటికి వెళ్లి ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు బృందాలను ముందుగానే గుర్తించి విధులను కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపి



రావిపాడు వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పోడూరు: రానున్న ఎన్నికల్లో ఓటు వేసి తనను పాలకొల్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఒక్క అవకాశం ఇవ్వాలనీ.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి అన్నారు. రావిపాడు గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అవ్వాతాతలు, మహిళలను, చిన్నారులను, యువతను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. ఎన్నికల్లో సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, గూడూరి ఉమాబాలను ఎంపీగా గెలిపించాలని కోరారు. సీఎం జగన్ పాలనలో అవినీతికి తావులేకుండా, పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా సుపరిపాలన అందించారన్నారు. మళ్లీ అటువంటి పాలన కావాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, మండల కన్వీనర్ పితాని చిన్నా, రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రయవర్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, నాయకులు ఉన్నారు.

తాగునీటికి పటిష్ట ప్రణాళిక

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో తాగునీరు, విద్యుత్ సరఫరా, జాతీయ ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. సోమవారం వెలగపూడి సచివాలయం నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. కాలువలు కట్టేలోపు పూర్తిస్థాయిలో తాగునీటి చెరువులను, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, మంచినీటి చెరువులు నింపుకోవాలన్నారు. నీటి నిల్వలను అనుసరించి తాగునీటి సరఫరాకు పక్కా ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో వేడిగాలులు అధికంగా వీస్తున్న దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఉపాధి హామీలో నీటి సంరక్షణ పనులు, మంచినీటి చెరువుల డీసిల్టింగ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్

ఉండి: ప్రజలంతా తమకు మేలు చేసిన ముఖ్యమంత్రి ఎవరూ అని మనస్సాక్షితో ఆలోచించి సీఎం జగన్‌కు ఓట్లు వేయాలని వైఎస్సార్‌సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు కోరారు. సోమవారం చెరుకువాడలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు(శివయ్య), వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ (సత్తిబాబు) ఆధ్వర్యంలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాజకీయాల అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రజలకు చేసిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్నారు. చెరుకువాడ గ్రామంలో సుమారు రూ.40 కోట్లు సంక్షేమానికి, రూ.1.10 కోట్లు రోడ్లు ఇతర కార్యక్రమాలకు రూ.1.50 కోట్లు ఆలయాల నిర్మాణానికి, రూ.10 కోట్లు ఇంటి స్థలాలకు వెచ్చించినట్టు చెప్పారు. ఇలా ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయరాజు, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

జనసేనలో కుమ్ములాటలు బట్టబయలు



వీరవాసరంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కొట్లాడుకుంటున్న జనసేన నాయకులు

భీమవరం: భీమవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ కూటమి నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాలు కొట్లాటలతో అల్లరి పాలవుతున్నాయి. భీమవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) బరిలో ఉన్నారు. టీడీపీకి చెందిన అంజిబాబు ఐదేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న సమయంలో కూటమి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీలో వర్గపోరు మొదలైంది. అలాగే మొదటి నుంచి జనసేనకు సేవలందిస్తున్న నాయకులను కాదని టీడీపీ నుంచి అరువు తెచ్చుకున్న అంజిబాబుకు టికెట్ ఇవ్వడం ఏంటంటూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు అంటీ ముట్టనట్లు ఉండటంతో వీరందరినీ ఏకతాటిపై తీసుకురావడానికి జనసేన, టీడీపీ, బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

తారాస్థాయికి వర్గ విభేదాలు : వీరవాసరంలోని తులసీ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జనసేన నాయకుల మధ్య విభేదాలు కొట్లాటకు దారి తీశాయి. మండలంలోని 20 గ్రామాల నుంచి జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. వీరవాసరం జెడ్పీటీసీ, జనసేన నాయకుడు గుండా జయప్రకాష్ నాయుడిని ముందుగా వేదిక పైకి పిలవకపోవడంతో వివాదం మొదలైంది. ఈ క్రమంలో అదే పార్టీకి చెందిన ఒక సర్పంచ్‌పై ఇతర నాయకులు పిడిగుద్దులు గుద్దారు. అనంతరం రెండు వర్గాల మధ్య జరిగిన వివాదంలో మరో నాయకుడి తలపై గట్టిగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైనట్టు తెలిసింది. చాలాకాలంగా వీరవాసరం మండలంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), జెడ్పీటీసీ జయప్రకాష్‌నాయుడి మధ్య గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల భీమవరంలో నిర్వహించిన కూటమి ఆత్మీయ సమావేశంలో జయప్రకాష్ వర్గానికి చెందిన నాయకుడిపై దాడి చేయడంతో వివాదం ముదిరి ఆదివారం నాటి కొట్లాటకు దారి తీసిందని పార్టీ నాయకులు చెబుతున్నారు. జనసేన నాయకులే వారిలో వారు కొట్లాడుకోవడం చూసిన టీడీపీ, బీజేపీ శ్రేణులు నిర్ఘాంతపోయారు.

క్లుప్తంగా

రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానానికే ప్రాధాన్యం

డీఆర్‌డీఓ శాస్త్రవేత్త అనిల్‌కుమార్



నిట్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్త అనిల్‌కుమార్

తాడేపల్లిగూడెం: దేశ రక్షణ అవసరాల కోసం అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో కూడిన ఆయుధాలు, యుద్ధ వాహనాల రూపకల్పనకు భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ అత్యంత ప్రాధాన్యతనిస్తోందని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ జి.అనిల్‌కుమార్ చెప్పారు. ఏపీ నిట్‌లో సోమవారం 'మాట్లాబ్ సిములింక్' అనే అంశంపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు కొత్తకొత్త యాప్‌లు, రియల్ టైమ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలు చేస్తూ, ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే విభిన్న పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. మాట్లాబ్ సిములింక్స్ పని చేసే విధానం, మోడల్ ఎలా నిర్మించాలి, వాటి ఉపయోగాలు, ప్రాధాన్యత విషయాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ వీరేష్‌కుమార్, జీఆర్‌కే శాస్త్రి, బాబూరావు, సందీప్, హైమావతి పాల్గొన్నారు.

మనసు గాయపడి.. కొలువు వీడి

ఉండి: టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల తీరుతో వలంటీర్ల మనసు గాయపడింది. గత నాలుగున్నరేళ్లుగా పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు అందేలా ఎంతో విలువైన సేవలందించిన వలంటీర్లపై కూటమి నేతలు విషప్రచారానికి తెరలేపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో టీడీపీ, జనసేన అధినేతలు, నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్న తీరు మరింత తీవ్రం కావడంతో వలంటీర్లు మనోవేదనకు గురవుతున్నారు. నిస్వార్థంగా సేవలందించినా గుర్తించకపోగా, తీవ్ర విమర్శలు గుప్పించడం, అనుమానాలు, వేధింపులకు గురిచేయడంతో లోలోన మదనపడుతున్నారు. కూటమి నేతల తీరుతో మనస్తాపంతో జిల్లాలో పలువురు వలంటీర్లు తమ ఉద్యోగాలకు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. చెరుకువాడ గ్రామ సచివాలయానికి చెందిన 26 మంది వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శి కే గోపాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో పాటు వారి పార్టీల నాయకులు ప్రజాభిమానాన్ని పొందలేక తమపై లేనిపోని మాటలు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్ది, సమాజంలో తమకు ఎంతో గౌరవం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం పనిచేసేందుకు తామంతా నిర్ణయించుకున్నామని చెప్పారు.



చెరుకువాడలో రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు

దురుద్దేశంతోనే బురద జల్లుతున్నారు

వీరవాసరం: దురుద్దేశంతోనే టీడీపీ, జనసేన అధినేతలు తమపై బురద జల్లుతున్నారని పలువురు వలంటీర్లు వాపోయారు. మండలంలో పలు గ్రామాల నుంచి వంద మంది వలంటీర్లు సోమవారం రాజీనామాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.వలంటీర్లను వేధింపులకు గురిచేస్తుండటానికి నిరసనగా రాజీనామాలు చేస్తున్నామని వివరించారు.

తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత

ఆకివీడు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. ఆకివీడులోని జానకమ్మ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారిపై వెళ్లుతున్న మోటారు సైకిలిస్టును తనిఖీ చేయగా రూ.12 లక్షల నగదు పట్టుబడినట్లు తనిఖీ బృందం అధికారి శ్రీకర్ సోమవారం చెప్పారు. ఆకివీడు నుంచి భీమవరానికి ఆక్వా వ్యాపార నిమిత్తం ముదునూరి సుబ్బరాజు అనే వ్యక్తి ఈ సొమ్మును తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నగదుకు సంబంధించిన ఆధారాలు అందజేసి సొమ్ము తీసుకువెళ్లవచ్చని శ్రీకర్ విలేకరులకు తెలిపారు.



తణుకులో స్కూటర్ డిక్కీ నుంచి నోట్ల కట్టలు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



వీరవాసరంలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరంలో రూ.5 లక్షల స్వాధీనం

వీరవాసరం: వీరవాసరం ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో సోమవారం రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ జె.సుశీలదేవి చెప్పారు. రామేశ్వరం గ్రామానికి చెందిన చెరుకూరి వంశీ లక్ష్మీపతిరాజు కారులో ఈ సొమ్మును తీసుకుని వెళుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీల్లో గుర్తించి స్వాధీనం చేసుకుందన్నారు. నగదును సీజ్ చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి

జంగారెడ్డిగూడెం రూరల్: నిమ్మలగూడెంలో పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుత్ షాక్‌కి గురై ఒక కూలీ మృతి చెందాడు. లక్కవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు గాంధీ (45) నిమ్మలగూడెంలో కౌలుకు సాగు చేస్తున్న పట్టపు మురళీ పామాయిల్ తోటలోకి గెలలు కోసేందుకు సోమవారం వెళ్లాడు. గెల కోస్తుండగా, హైలెవెల్ విద్యుత్ వైర్లకు కత్తి తగలడంతో గాంధీ విద్యుత్ షాక్‌కి గురయ్యాడు. దీంతో అతనిని లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి గాంధీ మృతి చెందినట్లు నిర్ధారించారు. లక్కవరం ఎస్సై సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గదిలో బంధించిన చిన్నారికి విముక్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఓ ఇంట్లో గదిలో బంధించిన ఓ చిన్నారికి సోమవారం ఐసీడీఎస్, మహిళా పోలీస్ విముక్తి కల్పించారు. ఐసీడీఎస్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెన్నేటి అరుణేశ్వరీ, జయ 8వ వార్డులో అంగన్‌వాడీ టీచర్లుగా పనిచేస్తున్నారు. సోమవారం స్థానిక ఝాన్సీరాణి ఆసుపత్రి రోడ్డులో అడ్డగర్ల వసంతరావు భార్య గంగాభవాని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తన భర్త వసంతరావు ఎక్కడ నుంచో ఓ పాప స్వాతి (8)ని తీసుకువచ్చారని, ఆమెను ఇంట్లో ఓ గదిలో బంధించారని చెప్పారు. ఈ విషయాన్ని అరుణేశ్వరీ, జయ వెంటనే వార్డు మహిళా పోలీస్ మంజులకు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ దుర్గాభవానీలకు దృష్టికి తీసుకువెళ్లారు. చిన్నారి గదిలో బంధించి ఉంచడాన్ని గమనించిన అంగన్‌వాడీ సిబ్బంది పోలీసుల సహాయాన్ని కోరారు. స్టేషన్ నుంచి వచ్చిన మహిళా కానిస్టేబుల్ రాగా, పాప వద్ద ఉంచిన తాళంతో ఆ పాపను బయటకు తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాప తనకు సంబంధించిన ఎటువంటి వ్యక్తిగత సమాచారం చెప్పలేకపోవడంతో సీడీపీఓ టీఎల్ సరస్వతి ఆదేశాల మేరకు ఐసీటీఎస్ డీసీపీఓ రాజేష్ ద్వారా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)తో మాట్లాడి తాత్కాలికంగా తణుకు బాల సదనానికి చేర్చారు.



పోలీస్ స్టేషన్‌లో చిన్నారితో ఐసీడీఎస్, మహిళా పోలీసులు

కారు ఢీకొని ఇద్దరు కూలీల దుర్మరణం



ఘటనా స్థలంలో ప్రమాదం దృశ్యం

యలమంచిలి: కాజ తూర్పు గ్రామ పరిధిలో హైవేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మరణించినట్లు ఎస్సై కాకి శివ నారాయణ చెప్పారు. విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలం ఉప్మాక అగ్రహారం గ్రామానికి చెందిన పూడి అప్పారావు (56) అదే మండలం చిన ఆనర్ల గ్రామానికి చెందిన కడియాల పెద మునియ్య (41) కుటుంబంతో కలిసి పదేళ్ల క్రితం అంబేడ్కర్ కొనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంక వచ్చి నివాసం ఉంటున్నారు. వీరు కల్లుగీత, కొబ్బరిదింపు కార్మికులుగా పని చేస్తున్నారు. పాలకొల్లులో కొబ్బరి దింపు పనుల కోసం సోమవారం గుడిమెళ్లంక నుంచి బైక్‌పై బయలుదేరారు. కాజ తూర్పు గ్రామ పరిధిలో హైవేపై ఎదురుగా వేగంగా వచ్చిన కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అప్పారావు కుమారుడు అప్పలరాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిరులు పండిస్తున్న 'కుజీ భటాలీ'



బాగా పండిన దేశవాళీ వంగడం కుజీ భటాలీ

ఆకివీడు: ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాల్ని అందజేయాలనే ఆశయంతో దేశవాళీ వంగడాన్ని సాగు చేసినట్లు మండలంలో సిద్దాపురం గ్రామ రైతు చిదానంద మూర్తిరాజు చెప్పారు. గ్రామంలోని సుమారు 70 సెంట్లలో కుజీ భటాలీ వంగడాన్ని 10 కేజీల విత్తనాలతో సాగు చేశానని, పంట సాగు బాగుందని, సెలనిటీ ప్రభావంతో కొన్ని మొక్కలు చనిపోయినప్పటికీ మిగిలిన వరి మొక్కల కంకులు అత్యధికంగా గింజల్ని కలిగి బంగారు కణికల వలే ఉన్నాయని చెప్పారు. సుమారు 20 బస్తాల దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ రకం వంగడంకు చెందిన బియ్యం భుజిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. గత ఖరీఫ్‌లో బహురూపి వంగడాన్ని 35 సెంట్లలో సాగు చేశానని, దిగుబడి ఆశాజనకంగా ఉందని మూర్తిరాజు వివరించారు. మండలంలో దేశవాళీ వంగడాల సాగును పెంచితే రైతులు ఆర్థికంగా మరింత బలపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు లాభసాటి ధరలు దేశీయ వంగడాలకు లభిస్తాయన్నారు. దేశీయ వంగడాల బియ్యానికి మంచి డిమాండ్ ఉందని, అత్యధిక ధర లభిస్తుందని ఆయన వివరించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టివేశారు. సీఎస్‌డీటీ వైవీ లక్ష్మీకుమారి, ఎస్సై పి.జ్యోతిబాస్ సోమవారం చేసిన వాహన తనిఖీల్లో జంగారెడ్డిగూడెం నుంచి దూబచర్లకు లారీలో 5 టన్నుల బియ్యం రవాణా అవుతున్నట్లు గుర్తించి, వాటిని పరిశీలించగా, పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. బియ్యం, వాహనం స్వాధీనం చేసుకుని, వ్యాన్ యజమాని సాన తేజకుమార్, వ్యాన్ డ్రైవర్ మేడిది వీరబాబుపై కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల కల్పనకు కృషి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు కల్పనకు అధికారులు కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు కోరారు. సోమవారం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ గత ఏడాది పనిలోకి వచ్చిన వారిలో కొంతమంది పేర్లు డిలీట్ అయ్యాయని కూలీలు తమ దృష్టికి తెచ్చారన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.జయమ్మ, నక్కా లక్ష్మి, బి.వెంకటలక్ష్మి, మేరీ, సత్యవతి, జ్యోతి, పద్దయ్య, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నీలాద్రిపురంలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అవగాహన, పని అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషనాత్మక తులన కార్యక్రమం చేపట్టారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు, డాక్టర్ రజిత, డాక్టర్ వి.వినయలక్ష్మి, వ్యవసాయ కళాశాలకు చెందిన వసంత భాను, పట్టింపాలెం వ్యవసాయ సహాయకులు విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

వాసవిలో పాలిసెట్ ఉచిత శిక్షణ

తాడేపల్లిగూడెం: పదో తరగతి పూర్తి చేసుకొని పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశానికి గాను ఏప్రిల్ 27వ తేదీ జరుగనున్న పాలిసెట్–2024 ప్రవేశ పరీక్షకు అభ్యర్థులకు ఉచితంగా వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్టు పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు తెలిపారు. వివరాలకు విద్యార్థులు కళాశాల పాలిటెక్నిక్ విభాగాకో ఆర్డినేటర్ .జి.రాంప్రసాద్‌ను సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 95055 18243 నంబరును సంప్రదించాలన్నారు.

జగనన్నను సీఎంగా గెలిపించుకుందాం

- నవరత్నాలతో ఆదర్శపాలన
- తణుకులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో మంత్రి కారుమూరి



తణుకు సజ్జాపురంలో ఎన్నికల ప్రచారంలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి.

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులంతా సైనికుడిలా పనిచేయాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకులో సోమవారం 28, 29, 30 వార్డులకు సంబంధించి పార్టీ శ్రేణులతో స్థానిక కోయాక్సిల్ రోడ్డులో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించిన జగనన్నను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాల్సిందిగా ప్రజలను అడిగే హక్కు మనకుందన్నారు. ప్రతి ఇంట్లోను జగనన్నను తమ సొంత బిడ్డగాను, అన్న, తమ్ముడు, మామయ్యగాను చూస్తున్నారనే విషయాన్ని పార్టీ కార్యకర్తలంతా గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ప్రతి కార్యకర్త, గృహసారథులు నిత్యం ప్రజలతో మమేకం అవుతూ వారికి అందిన సంక్షేమాన్ని గుర్తుచేసే పనిపెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, మారిశెట్టి శేషగిరి, గుడిమెట్ల సూర్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, నల్లూరి చంద్రశేఖర్, పుల్లెపు సూర్యచంద్రరావు, సువార్తమ్మ, యడ్లపల్లి సురేంద్ర, గెద్దాడ శ్రీకాంత్, చేశెట్టి శివశంకర్, కారుమంచి యోహాన్, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పరితపించిన వ్యక్తి మద్దాల

అత్తిలి: గ్రామాభివృద్ధికి నిరంతరం పరితపించిన స్వర్గీయ మద్దాల నాగేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మద్దాల నాగేశ్వరరావు 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటా విజేత నాగరాజు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

అత్తిలి: క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరారావు చెప్పారు. సోమవారం అత్తిలి గాంధీనగర్‌లో గల ప్రార్థనా మందిరంలో పాస్టర్లతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి కారుమూరి హాజరైయ్యారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రైస్తవుల బర్రెల గ్రాంట్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాస్టర్లకు ప్రతి నెలా రూ. 5వేలు గౌరవ వేతనం అందజేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో చర్చిల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు గెలుపొందాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జిల్లా పాస్టర్స్ సంఘ కమిటీ సభ్యులు ఎం దేవరాజు, అత్తిలి మండల పాస్టర్స్ సంఘ అధ్యక్షుడు వై బాబూరావు, సెక్రటరీ శేఖర్‌బాబు, జాయింట్ సెక్రటరీ పి శామ్యూల్‌వేణు, వైస్ ప్రెసిడెంట్ అగ్నిజ్వాల, కోశాధికారి పి సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

చెప్పింది చేయడమే జగన్ నైజం

తణుకు అర్బన్: ప్రజాసంకల్పయాత్ర ద్వారా కులం చూడం.. మతం చూడం అన్న నినాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటనిలబెట్టుకుని అర్హుందరికీ సంక్షేమం అందించారని ప్రజలు చెబుతుంటే సంతోషంగా ఉందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు సజ్జాపురంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పేదప్రజలను ఆదుకునేందుకు సంక్షేమాన్ని ఈరకంగా అందజేయాలనే ఆలోచనచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, వార్డు నాయకులు మారిశెట్టి శేషగిరి, గుడిమెట్ల సూర్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, నల్లూరి చంద్రశేఖర్, వై.రామకృష్ణ, పుల్లెపు సూర్యచంద్రరావు, సువార్తమ్మ, యడ్లపల్లి సురేంద్ర, డీజే అమూల్యారావు, తాటిపర్తి వాసు, రేలంగి రాంబాబు, సత్తా భాను, వీరమల్లు ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన ఉపముఖ్యమంత్రి కొట్టు



నూకాలమ్మను దర్శించుకుంటున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది సందర్భంగా పట్టణంలో ప్రతి ఏటా ఎంతో వైభవంగా నిర్వహించే శ్రీదేవి పుంతలోని నూకాలమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం సవిత్రుపేటలోని పుంతలో ముసలమ్మ అమ్మవారిని ఆయన దర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కోలాటం, ఊరేగింపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీపీగా సుంకర నాగేశ్వరరావు

అత్తిలి: మండల పరిషత్ అధ్యక్ష పదవికి మక్కా సూర్యారావు, మండల పరిషత్ మొదటి ఉపాధ్యక్ష పదవికి దారం శిరీషా రాజీనామా చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. గత నెల 26న ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారికి రాజీనామా సమర్పించి, రాజీనామాను ఆమోదించారని చెప్పారు. ఎంపీపీ, మొదటి వైస్ ఎంపీపీ పదవులకు వారు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినందున, పంచాయతీరాజ్ చట్ట ప్రకారం మండల పరిషత్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా రెండవ వైస్ ఎంపీపీగా ఉన్న ఈడూరు ఎంపీటీసీ సభ్యుడు సుంకర నాగేశ్వరరావును నియమించడం జరిగిందన్నారు. ఇక నుండి ఇన్‌ఛార్జ్ ఎంపీపీగా సుంకర నాగేశ్వరరావు వ్యవహరిస్తారని తెలిపారు.

మాజీ మంత్రి కుటుంబాన్ని కలిసిన మంత్రి కొట్టు



మాజీ మంత్రి స్వర్గీయ పైడికొండల మాణిక్యాలరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ ధర్మదాయ శాఖ మాజీ మంత్రి స్వర్గీయ పైడికొండల మాణిక్యాలరావు కుటుంబ సభ్యులను ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. మణిక్యాలరావు సతీమణి, కుమార్తె, అల్లుడు గట్టిం సింధు, నవీన్లను యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణకు పైడికొండల మాణిక్యాలారావు నిరంతరం శ్రమించారన్నారని అన్నారు. దేవదాయ శాఖ మంత్రిగా తాడేపల్లిగూడెంతో పాటు పరిసర ప్రాంతాల్లోని నూతన దేవాలయాల నిర్మాణం, దేవాలయాల పునఃనిర్మాణం, అభివృద్ధి చేసిన ఘనత మాణిక్యాలరావుకే దక్కుతుందన్నారు. అనతి కాలంలోనే ఆయన మరణించడం మనందరికీ తీవ్ర బాధను మిగల్చడం దురదృష్టకరమన్నారు. తన అండదండలు ఎల్లపుడూ ఆయన కుటుంబానికి ఉంటాయని మంత్రి కొట్టు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలని మంత్రి కొట్టు మాణిక్యాలరావు కుటుంబ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొద్దు సాయిబాబా ఉన్నారు.

ఇరగవరంలో వైఎస్సార్ సీపీలో చేరికలు



మంత్రి సమక్షంలో చేరుతున్న జనసేన నేతలు

ఇరగవరం: మండలంలోని ఓగిడి గ్రామంలో ఆత్మీయ సమ్మేళనంలో అర్జునుడు పాలెం గ్రామానికి చెందిన 35కుటుంబాలు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, డీసీఎంస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు, మండల యూత్ అధ్యక్షులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పలు గ్రామాల్లో అమ్మవార్ల జాతరలు

పెంటపాడు: ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలు వైభవంగా ప్రారంభంకానున్నాయి. బి. కొండేపాడు గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు పురస్కరించుకొని ఈనెల 9న అమ్మవారికి ఉగాదిపూజలు, 10న భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT TANUKU :: W.G.DIST.
I.P. No. 10/2024
[debtor I.P]

Between:-
PEDDIREDDY MANGA RAO......PETITIONER
and
AIREDDY SRINIVASU and Others
........RESPONDENTS

పిటీషనరు వేయించిన ప్రకటన

పై నంబరు పిటీషనులో I.P.10/2024 లో ఈ పిటీషనరు ఇన్ సాల్వెంట్ గా డిక్లేర్ చేయమని పై నెంబరు పిటీషను దాఖలు చేసి ఉన్నారు. శ్రీ కోర్టు వారు ప్రతివాదులకు పేపరు ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేసినారు.

పై నెంబరు పిటీషను వాయిదా తేదీ 30-04-2024 అయి ఉన్నది.

కావున మీరు ఆ తారీఖున ఉదయం 10.30 గంటలకు పై నెంబరు కోర్టులో స్వయముగా కాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరయి మీ అభ్యంతరములు తెలియపరచ కొనవలెను కావలెను. లేని యెడల సదరు పై నెంబరు పిటీషను వ్యాజ్యము మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

వేదుల వెంకటేష్
అడ్వకేట్,
తణుకు
సెల్ :98481 85974

తణుకు,
05.04.2024

వేల్పూరులో ఇంటింటా ప్రచారం



వేల్పూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వేల్పూరు గ్రామంలో గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. వేల్పూరు గ్రామంలో సోమవారం గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి జరగబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆదరించాలన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమా బాలలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, ఎంపీటీసీలు, పంచాయతీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపాకలో ఇంటింటి ప్రచారం

తణుకు టౌన్: రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతీ ఒక్కరూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని కోరుతూ తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో సోమవారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు మండపాక గ్రామంలోని ఎస్సీ ఏరియాలో ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, బూత్ కన్వీనర్‌లు పాతూరి శ్రీను, హేమ మహేశ్వరరావు, కాళ్ల సతీష్, రవికాంత్, సబ్బరపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీదానేశ్వరీ అమ్మవారి దేవస్థానం – దువ్వ (గ్రామం)
తణుకు మండలం, పగో.జిల్లా,

టెండర్ ప్రకటన

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, దువ్వ గ్రామంలో వెలసియున్న శ్రీదానేశ్వరీ అమ్మవారి దేవస్థానం [illegible] సీల్డు టెండర్లు ది.24-04-2024 [illegible]

టెండర్ షెడ్యూలు

క్ర.సం.	[illegible] వివరములు	సీల్డు టెండర్	కాల పరిమితి	[illegible]	ధరావతు
1.	[illegible]	సీల్డు టెండర్	1-5-2024 నుండి 30-4-2025 వరకు	రూ.200	రూ.20,000

షరతులు : [illegible] 3) టెండర్ షెడ్యూలు ది.20-04-2024వ తేది సోమవారం ఉదయం గం.10.00ని నుండి ది.24-04-2024 [illegible] గం.10.00ల వరకు [illegible] 5) సీల్డు టెండరు దాఖలు ది.24-04-2024 వ తేది బుధవారం ఉదయం గం.11.00ని లోపు [illegible] 6) ది.24-04-2024వ తేది మధ్యాహ్నం గం.12.00ని లకు సీల్డు టెండర్లు తెరవబడును. 7) ఇతర వివరములు దేవస్థానం కార్యాలయము పనివేళలో ఫోన్ నెం.94906 86428, 90199 11474 ల యందు సంప్రదించగలరు.

దువ్వ, ది.08-04-2024

ముత్యాల సత్యనారాయణ
కార్యనిర్వహణాధికారి


టీడీపీ కోవర్ట్ పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తణుకు అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేస్తున్న దుగ్గపాటి పురందేశ్వరి టీడీపీ కోవర్టని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. తణుకులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమిలో కలవక ముందునుంచి కూడా పురందేశ్వరి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబుకు అనుకూలంగానే పనిచేశారని, నిరంతరం ఆయన శ్రేయస్సుకోసం తపించిపోయారని దుయ్యబట్టారు. భారతీయ జనతాపార్టీ కోసం పూర్వం నుంచి పనిచేసిన వారందరిని తుంగలోకి తొక్కి బ్యాంకులకు ఎగనామం పెట్టి కోట్లాది రూపాయిలు దోచుకున్న తెదేపా నుంచి వచ్చిన వారికి టికెట్స్ ఇవ్వడంతోనే బీజేపీ పతనం ప్రారంభమైందని విమర్శించారు. ఏపీలో ఒక్క శాతం ఓట్లు లేని బీజేపీని చంద్రబాబు కలిపి పోల్ మేనేజ్‌మెంట్ చేసేందుకు కార్యాచరణ చేస్తున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో మాల మహానాడు, బీసీ సంఘాల నాయకులు కె.బాలకృష్ణ, డి.పరమేశ్వరరావు, బి.సునీల్‌బాబు, సీహెచ్ గోపి, ఎం.కిరణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు జగనన్నతోనే సాధ్యం



6వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి కొట్టు కుమార్తె కంచన్

తాడేపల్లిగూడెం అర్బన్: సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు రాజేష్, కుమార్తె కాంచన తెలిపారు. స్థానిక 6వ వార్డులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఆరోవ వార్డు ఇన్‌చార్జ్ మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహి, కర్రి భాస్కరరావు, చామన సూర్యచంద్రరావు, బోణం విజయ నిర్మల, దింటకుర్తి లీలావతి, బోశం రామలక్ష్మి, బోశం రమణ పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

తాడేపల్లిగూడెం: ఎన్నికల్లో వివిధ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమనిబంధనలను పాటించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.చెన్నయ్య చెప్పారు. సోమవారం ఆయన కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన ప్రాంతాలలోనే ప్రచారానికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వ్యయానికి సంబంధించి లెక్కలు పక్కాగా ఉండాలన్నారు.